క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ దేశ్యనాయక్

తుర్కపల్లి: తుర్కపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ దేశ్యనాయక్ బుధవారం పరిశీలించారు. కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐలు జహంగీర్, రఘు రామారావు తదితరులున్నారు.

జలాల్‌పూర్‌లో..



జలాల్‌పూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి

బొమ్మలరామారం: మండలంలో జలాల్‌పురంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చౌటుప్పల్: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ట్రినిటీ విద్యాసంస్థల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఓటు వేయడం ద్వారా కలిగే ప్రయోజనాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల, చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ప్రవీణ్‌రెడ్డి

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం రాత్రి పట్టణంలోని జమాలే బహార్ దర్గా గంధం ఊరేగింపు నిర్వహించారు. దర్గాలో పూల చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిరా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ కోలన్ ప్రవీణ్‌రెడ్డి, అడ్వకేట్ సామ రాజేందర్‌రెడ్డి, చామల భానుచందర్‌రెడ్డి, చామాల ఉదయ్ చందర్‌రెడ్డి ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మజహర్‌పాషా, ఆసిఫ్, ముజకీర్, అబ్దుల్లా తదితరులుఉన్నారు.

200 మంది పోలీసులతో భారీ బందోబస్తు



పోలింగ్ కేంద్రానికి చేరిన ఎన్నికల సిబ్బంది

మునుగోడు: నియోజకవర్గంలో గురువారం నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఇద్దరు చొప్పున కానిస్టేబుళ్లు, ప్రతి రూట్‌కు ఒక మొబైల్ టీమ్‌తో పాటు ప్రత్యేక బలగాలను నియమించారు. మండల వ్యాప్తంగా ఉన్న 26 గ్రామాల్లో 44 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో బూత్‌లో నలుగురి చొప్పున నియమించారు. బుధవారం చండూరు నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఈవీఎంలతో పాటు సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



భువనగిరిలోని అరోరా కాలేజీలో పోలింగ్ సామగ్రి సిద్ధం చేసుకుంటున్న అధికారులు, సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో గురువారం జరగనున్న పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 13,465 మంది ఓట్లు సద్వినియోగం చేసుకోనున్నారు. మండలంలో 27,031 మంది ఓటు వేయనున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రితో ఏపీఓలు, పీఓలు, పోలీసులు చేరుకున్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ అమలు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,33,266 మంది ఓటర్లు ఓటు వేసేందుకు సిద్ధమయ్యారు. వంద శాతం ఓటింగ్ కోసం అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మహిళలకు, వికలాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మోడల్ పోలింగ్ స్టేషన్లను అధికారులు తీర్చిదిద్దుతున్నారు. మామిడి, అరటి తోరణాలతో ఓటర్లను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి

భూదాన్‌పోచంపల్లి: మండల వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి వీరాబాయి బుధవారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు. మండల వ్యాప్తంగా 42,851 ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఇందులో పురుషులు 21434, స్త్రీలు 21417 మంది ఉన్నారని తెలిపారు. మొత్తం 50 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రతి ఓటరు తమ వెంట ఓటరు స్లిప్ లేదా, ఏదేని గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. కాగా.. పోచంపల్లి మున్సిపాలిటీలో 15,474 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా గురువారం ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

అడ్డగూడూరు మండలంలో

అడ్డగూడూరు: అడ్డగూడూరు మండలంలో 30 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు, మొత్తం 22,631 ఓటర్లు తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోనున్నట్లు తహసీల్దార్ శేషగిరిరావు బుధవారం తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో బుధవారం సాయంత్రం కేంద్రాలకు చేరుకున్నట్లు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు

ఆలేరురూరల్: పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్ఓ జి.వీరారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలోని ఎనమిది మండలాల పరిధిలో గురువారం ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని పేర్కొన్నారు. మొత్తం 36 రూట్లలో 309 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఇందులో మహిళా పోలింగ్ స్టేషన్, వికలాంగుల పోలింగ్ స్టేషన్, మోడల్ పోలింగ్ స్టేషన్‌లు రెండు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఐడింటిఫికేషన్ అధికారులతో పాటు ఇతర అధికారులు సిబ్బంది మొత్తం కలిపి 1650 మంది ఉన్నారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 2,32,266 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఇందులో పురుషులు 1,16,708 మంది కాగా మహిళలకు 1,16,539 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు 19 మంది ఉన్నారని తెలిపారు. సజావుగా ఎన్నికల జరిగేందుకు 160 కేంద్రాల్లో కెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులతో గట్టి భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే పోలింగ్ ప్రక్రియను ఎన్నికల పరిశీలకులు, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రజలంతా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.



భువనగిరిలో పోలింగ్ సామగ్రిని చెక్ చేసుకుంటున్న ఎన్నికల అధికారులు, సిబ్బంది

పోలింగ్ బూత్‌కు చేరుకున్న సిబ్బంది

గుండాల: పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రమే ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. గుండాల మండలంలోని 20 గ్రామాల్లో 35 బూత్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

మోత్కూరులో..

మోత్కూరు: మండలంలో 31 పోలింగ్ బూత్‌ల పరిధిలో 26,953 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 13,445 మంది పురుషులు. 13,508 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మున్సిపల్ పరిధిలోని 17 బూత్‌ల పరిధిలో 14,078 మంది ఓటర్లు ఉన్నారు. మండల పరిధిలోని పది గ్రామ పంచాయతీల పరిధిలో 14 బూత్‌లలో 12,875 మంది ఓటర్లు ఉన్నారు. వీటిల్లో అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు అధికారులు బుధవారం తెలిపారు. సీసీ కెమెరాలు, వికలాంగుల కోసం ట్రై సైకిళ్లను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

రామన్నపేట మండలంలో



రామన్నపేటకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

రామన్నపేట: పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రామన్నపేట మండలంలో మొత్తం 44,183మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 22,342మంది పురుషులు, 21,841మంది స్త్రీలు ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు 59 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 34 పోలింగ్ కేంద్రాన్ని మోడల్ పోలింగ్ స్టేషన్‌గా తీర్చిదిద్దారు. ఓటర్లను ఆకర్షించే విధంగా స్వాగతం తోరణం, గ్రీన్‌కార్పెట్‌ను ఏర్పాటుచేసి బెలూన్లతో అలంకరించారు. ఎన్నికల సిబ్బంది బుధవారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు.



అడ్డగూడూరులో పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న సిబ్బంది



మోత్కూరు హైస్కూల్‌కు చేరుకున్న ఎన్నికల అధికారులు, సిబ్బంది



యాదగిరిగుట్టలోని 145 పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లే ఓటర్లకు స్వాగత తోరణం ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



ఆలేరు రూరల్: పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది



మోత్కూరు పోలింగ్ బూత్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



భూదాన్‌పోచంపల్లి: ఈవీఎం మిషన్లను సరిచూసుకుంటున్న పోలింగ్ ఆఫీసర్



ఆలేరురూరల్: బందోబస్తుకు వచ్చిన పోలీసులు, కేంద్ర బలగాలు

చౌటుప్పల్ మండలంలో 72 కేంద్రాలు

చౌటుప్పల్: మండల వ్యాప్తంగా 62,422 మంది ఓటర్లకు 72 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం ఓటర్లలో 31,,175 మంది పురుషులు, 31,246 మంది మహిళలు, 1 ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో అన్నిరకాల వసతులు కల్పించారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో పీఓ ఒకరు, ఏపీఓ ఒకరు, ఓపీఎస్‌లు ఇద్దరి చొప్పున నియమించారు. మండలంలోని పోలింగ్ స్టేషన్‌లను ఆరు రూట్‌లుగా విభజించారు. రూట్– 1కు డి.ప్రేమ్‌కుమార్, రూట్– 2కు పి.రఘు, రూట్– 3కి ఎం.రాజవర్ధన్‌రెడ్డి, రూట్– 4కి ఏ.గీతామాధవి, రూట్– 5కి వి.స్రవంతి, రూట్– 6కి రవీందర్‌లను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. ఎన్నికల సామగ్రిని చండూరులోని ఆర్వో కార్యాలయం నుంచి తీసుకువచ్చారు. స్థానిక సహాయ ఎన్నికల అధికారి హరికృష్ణ పర్యవేక్షించనున్నారు.

12 ప్రత్యేక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



చౌటుప్పల్‌లో ఎన్నికల సామగ్రితో కేంద్రానికి వస్తున్న సిబ్బంది

చౌటుప్పల్ : మునుగోడు నియోజకవర్గంలో 12ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో మహిళలకు ఐదు, మోడల్ ఐదు, యువతకు ఒకటి, దివ్యాంగులకు ఒకటి చొప్పున ఉన్నాయి. చౌటుప్పల్ పట్టణంలోని 34వ బూత్(బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో మోడల్), 42వ బూత్(జెడ్పీ ఉన్నత పాఠశాల సౌత్)లో మహిళలు, నారాయణపురంలోని 98వ బూత్(బాలుర ఉన్నత పాఠశాల నార్త్)లో మోడల్, 104వ బూత్(ప్రాథమిక పాఠశాల)లో మహిళలు, మునుగోడులోని 157వ బూత్(జెడ్పీ హైస్కూల్)లో మోడల్, గట్టుప్పల్ 191బూత్(గ్రామ పంచాయితీ కార్యాలయం)లో మహిళలు, చండూర్ మధిర లక్కినేనిగూడెం 205బూత్(చండూర్)లో మహిళలు, చండూర్ 207బూత్(వైశ్య మార్కెట్ కమిటీ కార్యాలయం)లో యువత, చండూర్ మండలం అంగడిపేట 215భూత్(గ్రామపంచాయితీ కార్యాలయం)లో దివ్యాంగులు చండూరు మండలం కోటయ్యగూడెం 217బూత్(ప్రాథమిక పాఠశాల)లో మోడల్, మర్రిగూడ 240బూత్(జెడ్పీ ఉన్నత పాఠశాల నార్త్)లో మోడల్, నాంపల్లి 303 బూత్(జెడ్పీ హైస్కూల్ ఈస్ట్)లో మహిళల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు



పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, పోలింగ్ అధికారులు

వలిగొండ: మండలంలోని 62 పోలింగ్ స్టేషన్లల్లో అన్ని ఏర్పాట్లతో సర్వం సిద్ధం చేశామని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానికంగా మాట్లాడారు. ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ జరిగేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల అధికారులకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు భంగం కల్గించే వారిపై ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సమస్యాత్మకంగా గుర్తించిన పోలింగ్ స్టేషన్లలో ముందస్తుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. అరూరులో అత్యధికంగా 6, పులిగిల్లలో 5 సీసీ కెమెరాలను కలుపుకొని మండల వ్యాప్తంగా 38 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా 47,737 మంది ఓటర్లు ఉండగా పురుషులు 23,891 మంది, మహిళలు 23,846 మంది ఉన్నారు. మండల పరిధిలోని నర్సయ్యగూడెం గ్రామం పోలింగ్ స్టేషన్లో 388 మంది, గంగాపురం పోలింగ్ స్టేషన్లో 68 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి ఏడుగురు రూట్ ఆఫీసర్లతోపాటు సుమారు 434 మంది సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



భూదాన్‌పోచంపల్లిలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఈఆర్ఓ వీరాబాయి, మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి

భూదాన్‌పోచంపల్లి: భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని 166 పోలింగ్ బూత్‌ను అధికారులు మోడల్ పోలింగ్ కేంద్రంగా తీర్చిదిద్దారు. కేంద్రాన్ని అరటి ఆకులు, మామిడి తోరణాలు కట్టి, కార్పెట్ పరిచి ప్రత్యేకంగా అలంకరించారు. ఓటర్ సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. మండలంలోని దోతిగూడెంలోని 180 పోలింగ్ కేంద్రాన్ని మహిళల కోసం ప్రత్యేకంగా కేటాయించారు. ఇక్కడ మహిళా పోలింగ్ ఆఫీసర్లు, మహిళా పోలీస్ కానిస్టేబుళ్ల, సిబ్బంది ఉంటారు. బుధవారం ఆయా పోలింగ్ కేంద్రాలను ఏఈఆర్ఓ వీరాబాయి, మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.



ఓటరు సెల్ఫీ పాయింట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నాటారు.. పెంచారు.. నరికారు!

- చౌటుప్పల్ బస్టాండ్ ప్రాంగణంలో హరితహారం చెట్ల నరికివేత
- వాహనాలు పార్కింగ్ చేస్తున్నారన్న కారణంతో తొలగింపు

చౌటుప్పల్ : హరితహారంలో భాగంగా చౌటుప్పల్‌లోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నాటిన మొక్కలను ఇష్టానుసారంగా నరికివేస్తున్నారు. 2015లో నాటిన కానుగు మొక్కలు వృక్షాలుగా మారి నీడనిస్తున్నాయి. అయితే స్థానికులు చెట్ల నీడన వాహనాలను పార్కింగ్ చేసి వెళ్తుండడంతో తమకు గిరాకీ రావడం లేదన్న కారణంతో పార్కింగ్ స్టాండ్ల నిర్వాహకులు, ఆర్టీసీ సిబ్బంది కలిసి చెట్లను నరికివేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఏపుగా పెరిగిన చెట్లను నరికివేయడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా చెట్లను నరికివేసిన సమయంలో వాటి కింద తమ వాహనాలు ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోలేదని వాహనదారులు వాపోయారు.



పార్కింగ్ చేసిన బైక్‌లపై పడిన చెట్ల కొమ్మలు

నిస్వార్థ సేవకుడిని ఎన్నుకుంటాం

నూతన ఓటర్ల మనోగతం

సేవ చేసే నాయకుడికే ఓటు వేస్తా..



నాకు నూతనంగా ఓటు వచ్చింది. ప్రజలకు మంచి చేసే నాయకులకే ఓటు వేస్తాను. గెలిచిన ప్రతి నాయకుడు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. నూతనంగా ఓటు వచ్చిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ ఆలోచన చేసి ఓటు వేస్తే అభివృద్ధి జరిగేందుకు ఆస్కారం ఉంటుంది.

– గుండ్ల వాసవి, గుండ్లపల్లి, యాదగిరిగుట్ట మండలం

ఉపాధి అవకాశాలు కల్పించేలా నాయకుడు ఉండాలి



నాకు ఈ ఏడాది కొత్తగా ఓటు హక్కు వచ్చింది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయడం ఎంతో సంతోషంగా ఉంది. నేటి యువత ఉన్నత చదువులు చదివి నిరుద్యోగులుగా మారుతున్నారు. ఆలాంటి వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా నాయకులు ఉండాలి. అలాంటి వారికే నా ఓటు వేయాలనుకుంటున్నాను. – ఎక్కలదేవి రుషి, రాజాపేట

రాజ్యాంగం కల్పించిన హక్కు



దేశాన్ని నడిపించేది రాజ్యాంగం విలువలే. రాజ్యాంగంలో లిఖించినట్లుగా దేశం అభివృద్ధి సాధించాలంటే మంచి నాయకుడిని ఎన్నుకోవాలి. అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు కల్పించి, సామాజిక దృక్పథంతో కలిగిన అభ్యర్థులను పట్టం కట్టాలి. పేదలకు అండగా ఉండే నాయకుడికి ఓటు వేస్తాను.

కూళ్ల దీప్తి, బహదూర్‌పేట, ఆలేరు

సమస్యలను పరిష్కరించే నాయకుడికే ఓటు వేస్తా



స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకుడికే ఓటు వేస్తా. రాజ్యాంగం ప్రకారం మొదటి సారిగా ఓటు హక్కును వినియోగించుకోబోతున్న. అందుకు ఆయుధంగా భావించే ఓటు హక్కును సమర్థుడు, సమస్యల పట్ల అవగాహన ఉన్న నాయకుడికి ఓటు వేయాలని నిర్ణయించుకున్నా. ప్రతి ఒక్కరూ తమ ఓటును బ్రహ్మాస్త్రంగా భావించి ఓటును సద్వినియోగం చేసుకోవాలి.

– భవాని, సంజీవనగర్, భువనగిరి

సమర్థ నాయకుడికే ఓటు



నాకు నూతనంగా ఓటు హక్కు వచ్చింది. ఈ ఎన్నికల్లో సమర్థవంతమైన నాయకుడికే తొలి ఓటు వేస్తా. సమర్థుడిని ఎన్నుకోకుంటే భవిష్యత్‌లో సమస్యలు వస్తాయి. యువత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నేను వేసే మొదటి ఓటు విజయం సాధించాలని కోరుకుంటున్నాను.

– ఎండీ సమీర్, చౌటుప్పల్

భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఓటు వేస్తా



నాకు మొదటిసారిగా ఓటు హక్కు వచ్చింది. ఎంతో ఆనందంగా ఉంది. నా వ్యక్తిగత ఆలోచన మేరకే ఓటు వేస్తాను. ఓటు హక్కుపై అవగాహన ఉంది. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఓటుకు ప్రాధాన్యత ఇస్తా. యువత ఓటు హక్కు వినియోగించుకోవాలి.

– ఎండీ ముదబ్బిర్‌షరీఫ్, చౌటుప్పల్

ఉపాధి కల్పించే వ్యక్తికే ప్రాధాన్యం



యువతకు ఉపాధి కల్పించే నాయకుడికే ఓటు వేస్తా. పెద్ద చదువులు చదివి నిరుద్యోగులుగా ఉన్న వారి సంఖ్య అధికంగా ఉంది. సామాన్యులు పరిస్థితి చెప్పనవసరం లేదు. ప్రస్తుతం జనాభాలో యువత అధికంగా ఉంది. వారికి న్యాయం చేసే వారిని ఆదరించాలి. యువత తప్పకుండా ఓటుహక్కు వినియోగించుకోవాలి

– కొరుటూరి ఉదయ్ తేజ, ఆలేరు

అభివృద్ధి చేసే వారిని ఎన్నుకుందాం



నాకు మొదటిసారిగా ఓటు హక్కు వచ్చింది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, నిస్వార్థంగా ప్రజాసేవ చేసే అభ్యర్థికే ఓటు వేస్తాను. ఇలాంటి వారిని ఎన్నుకుంటే గ్రామాభివృద్ధి చేస్తారని నమ్ముతున్నాను.

– దబ్బీకార్ రాహుల్, భూదాన్‌పోచంపల్లి

ఓటుకు నోటు వ్యతిరేకిస్తా



నేను మొదటిసారిగా ఓటు వేస్తున్నా. ఓటుకు నోటు వ్యతిరేకిస్తా. విద్య వైద్యం ఉచితంగా ఇచ్చే వారికి ఓటువేస్తా. నాయకులు సమాజ మార్పుకు కృషిచేయాలి. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి. అలాంటి వారికే ప్రాధాన్యం ఇస్తా.

– షణ్ముఖరెడ్డి, భువనగిరి